సాక్షి
కర్నూలు
ఆదివారం । 31 । మార్చి । 2024


జొన్నగిరి గ్రామంలో జననేత కోసం ఎదురు చూస్తున్న ప్రజలు


ఊరంతా పండగ
గజమాలతో జననేతకు స్వాగతం పలుకుతున్న రాతన గ్రామస్తులు

సీఎం జగన్ జైత్రయాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

- పూలు చల్లుతూ అభిమాన నేతకు అపూర్వ స్వాగతం పలికిన మహిళలు
- తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖి మాట్లాడిన ముఖ్యమంత్రి
- విజయవంతమైన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- చెర్వుతండా మీదుగా అనంతపురం జిల్లాలోకి ప్రవేశం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపిన సీఎం జగన్ బస్సుయాత్ర

పల్లెపల్లెనా ఆత్మీయ జల్లు కురిసింది.. గుండెగుండెలో అభిమానం ఉప్పొంగింది.. మదిమదిలో ఉత్సాహం ఉరకలెత్తి దారుల నిండా జనహోరై వర్షించింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన జైత్రయాత్ర శనివారం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. అన్ని వర్గాలకు మంచి చేసిన అన్న రావడంతో ఊరూ వాడా మురిసి పోయింది. ప్రతి ఇంటా పండుగ వాతావరణం కనిపించింది. మేమంతా సిద్ధం అంటూ బస్సు యాత్రలో సమరోత్సాహం పెల్లుబికింది. ప్రజలతో మమేకమవుతూ.. భవిష్యత్తు దారి చూపుతూ సీఎం జగన్ యాత్ర కర్నూలు జిల్లాలో దిగ్విజయంగా ముగిసింది.

అన్న కదిలొచ్చె.. పల్లె ఎదురొచ్చె!


తుగ్గలిలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. జననేత వాహనం వెంట పరుగులు తీస్తూ.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. పార్టీ జెండాలతో యువకులు కదంతొక్కారు. ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్ చిరునవ్వుతో అభివాదం చేస్తూ జైత్రయాత్రను కొనసాగించారు. దారి మధ్యలో బస్సు దిగి అవ్వాతాతలు, దివ్యాంగులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ భవిష్యత్తుకు ఓటేమయని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర కర్నూలు జిల్లాలో శనివారం ముగిసి అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. బస్సు యాత్రలో పాల్గొనేందుకు, తమ అభిమాన నేతను కళ్లారా చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. పల్లెపల్లెనా పూల జల్లులు కురిపిస్తూ జననేతకు స్వాగతం పలికారు. ప్రజల అభిమానానికి సీఎం వైఎస్ జగన్ ముగ్ధుడయ్యారు. చిరునవ్వులు చిందిస్తూ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. కొన్ని చోట్ల బస్సు దిగి ప్రజలతో మమేకమయ్యారు. సీఎంతో కరచాలనం చేసిన యువకులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.


మా నాయనే.. ఎర్రగుడిలో సీఎం జగన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న అవ్వ


రాతన గ్రామంలో ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో సీఎం జగన్

జనంతో కిక్కిరిసిన దారులు

పత్తికొండ బైపాస్‌లో సీఎం వైఎస్ జగన్ బస చేసిన శిబిరానికి ఉదయం నుంచే పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. అభిమాన నేతను చూసేందుకు ప్రజలు కూడా భారీ సంఖ్యలో గుమిగూడారు. దీంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. పలు నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలను సీఎం కలిశారు. వారితో రాజకీయ అంశాలపై చర్చించారు. ఉదయం 10.32 గంటలకు శిబిరం నుంచి యాత్ర ప్రారంభించారు. అక్కడి నుండి రాతన గ్రామంలోకి చేరుకోగా దారి పొడవునా పూలు చల్లుతూ జననేతకు స్వాగతం పలికారు. అందరికి అభివాదం చేస్తూ సీఎం జగన్ ముందుకు కదిలారు. బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ తుగ్గలి వైపు సాగారు. జననేత వస్తున్నారని తెలిసి తుగ్గలి గ్రామస్తులు ఇంటివద్దే ఉన్నారు. కొంతమంది బంధువులను కూడా ఇళ్లకు పిలిపించుకున్నారు. అభిమాన నేతను చూసేందుకు వృద్ధులు, మహిళలు, యువకులతో పాటు చిన్న పిల్లలు కూడా రోడ్లపైకి వచ్చారు. సీఎం కాన్వాయ్ కన్పించగానే అందరి ముఖాల్లో ఒక్కసారిగా నవ్వులు చిందాయి. 'అదిగో జగనన్న...అదిగో సీఎం!' అంటూ అందరూ కాన్వాయ్‌వైపు పరుగులు పెట్టారు. భారీ క్రేన్‌తో గజమాల వేసి గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆయనపై పూలవర్షం కురిపించారు. వారి అభిమానంతో జగన్ తడిసిపోయారు. తుగ్గలిలో గంటన్నరపాటు బస్సు యాత్ర సాగింది. అవ్వలను ప్రేమగా ముద్దాడుతూ...ఆడబిడ్డల తలపై చేయి పెట్టి ఆశీర్వదిస్తూ, చిన్న పిల్లలను దీవిస్తూ ఓపిగ్గా సీఎం జగన్ ముందుకు సాగారు. తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఆరోగ్యశ్రీతో చికిత్స చేయించుకుని పునర్జన్మ పొందామని, ప్రభుత్వం చేసిన ఆర్థికసాయంతో సొంత కాళ్లపై నిలబడ్డామని చాలా మంది చెప్పుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలు వివరిస్తుంటే సీఎం మురిసిపోయారు. బాగుపడిన కుటుంబాల ఆనందం కళ్లెదుట కన్పిస్తుంటే చిరునవ్వులు చిందించారు. అక్కడకు వచ్చిన వారిలో రైతులు, పిల్లలు, వృద్ధులు జగన్‌మోహన్‌రెడ్డిపై పాటలు పాడేందుకు పోటీ పడ్డారు. దీంతో 'తుగ్గలిలో అంతా కళాకారులే ఉన్నట్లు ఉన్నారు!' అని జననేత నవ్వులు పూయించారు. తుగ్గలి, రాతన గ్రామానికి జరిగిన మేలును గణాంకాలతో వివరించారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ప్రజలతో ఓపిగ్గా ఫొటోలు దిగారు. అక్కడి నుండి నేరుగా జొన్నగిరి గ్రామానికి చేరుకున్నారు. జొన్నగిరిలో గ్రామస్తులు సీఎంపై పూలవర్షం కురిపించారు. అనంతరం ఎర్రగుడి, బసినేపల్లి తండాల మీదుగా అనంతపురం జిల్లాలోకి ప్రవేశించారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవితో పాటు స్థానిక నేతలు సీఎంకు వీడ్కోలు పలికారు.


తుగ్గలిలో జననేతతో సెల్ఫీ తీసుకుంటున్న యువతి


అదిగో దేవుడు.. తన కుమార్తెకు సీఎం జగన్‌ను చూపుతున్న తండ్రి

యువోత్సాహం: తుగ్గలిలో సీఎం జగన్ పెయింటింగ్‌ను చూపుతున్న యువకులు




మానమ్మకం నువ్వే అన్నా.. పత్తికొండలో వైఎస్సార్‌సీపీ జెండాతో దివ్యాంగురాలు

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. కర్నూలు జిల్లాలోని పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో యాత్ర సాగింది. ఆయా నియోజకవర్గాల ప్రజలు జననేతను చూసేందుకు భారీగా తరలివచ్చారు. లక్షలాది జనం పాల్గొని ఎమ్మిగనూరు సభను విజయవంతం చేశారు. అక్కడ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తూ..., వారి గుణగుణాలు, ఆర్థిక పరిస్థితుల గురించి ప్రజలకు చెప్పడం చూస్తే ప్రతీ అభ్యర్థిపై సీఎం జగన్ ఎంత స్పష్టంగా ఉన్నారో స్పష్టమైంది. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ 2019 తరహాలోనే విజయదుందుభి మోగిస్తుందనే ధీమాను ఆపార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. బస్సుయాత్రలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, పత్తికొండ వైఎస్ఆర్‌సీపీ నాయకులు నాగరత్నమ్మ, ఎస్.రామచంద్రారెడ్డి, పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జనంలో ఒకడిగా... జనం సమస్యలు వింటూ

బస్సు యాత్రలో ప్రజల సమస్యలు వినేందుకు సీఎం ప్రాధాన్యత ఇచ్చారు. జనంలో ఒకడిగా...జనం సమస్యలు వింటూ ముందుకు సాగారు. తమ గ్రామ సమీపంలోని చెరువును హంద్రీ-నీవా నీటితో నింపాలని తుగ్గలి, రాతన గ్రామస్తులు కోరగా.. రెండు నెలలు ఓపిక పట్టాలని, మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తప్పకుండా మేలు చేస్తానన్నారు. దీంతో రైతులు ఈలలు, కేకలు వేసి 'జై జగన్..సీఎం..సీఎం' అంటూ నినదించారు. తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖిలో మాట్లాడలేని వారందరికీ స్లిప్పులు ఇచ్చి అందులో రాయాలని, బాక్స్‌లో వేయాలని సూచించారు. పెద్దన్నలా తమ కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపాడుతోందని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఈ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నామని ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు చెప్పారు.

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:48
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:51
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:45
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:46
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:46

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

ఉపవాస దీక్షలు పాటించేవారి పట్ల మృదు స్వభావం కలిగి ఉండండి. వారి పట్ల కఠినత్వం చూపే వారి పట్ల అల్లాహ్ కూడా కఠినంగా ఉంటాడు.

– పవిత్ర ఖురాన్





గోరంట్ల గ్రామం భక్తజనసంద్రమైంది. గోవింద నామస్మరణ మారుమోగింది. గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రథోత్సవం కనులపండువగా సాగింది. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – కోడుమూరు రూరల్

దళితులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో రామాంజనేయులు, కల్లుపోతుల సురేష్ తదితరులు

- టిప్పర్ డ్రైవర్, ఉపాధి కూలీకి ఎమ్మెల్యే టికెట్‌లు ఇవ్వడం నేరమా?
- అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు
- ఎన్నికల్లో ఎస్సీల సత్తా చూపిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు

ఆదోని రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దళితులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ డిమాండ్ చేశారు. ఆదోని పట్టణంలోని పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి వెళ్లి టిప్పర్ డ్రైవర్ అయిన వీరాంజనేయులకు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇవ్వడంపై అవహేళన చేశారన్నారు. దళితుల మనోభావాలను దెబ్బతీశాడన్నారు. భేషరతుగా క్షమాపణ చెప్పని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో మడకశిర నియోజకవర్గ టికెట్‌ను ఎస్సీ వర్గానికి చెందిన వీరల క్కప్ప అనే ఉపాధి కూలీకి ఇవ్వడంపై వ్యంగ్యంగా మాట్లాడి ఎస్సీలను కించపరిచారన్నారు. డబ్బున్న వారికి టికెట్లను అమ్ముకునే సంస్కృతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. నిరుపేదలను అందలం ఎక్కించేందుకే టికెట్లు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 200 అసెంబ్లీ, ఎంపీ స్థానాలు ఉండగా 100 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ టికెట్లను కేటాయించిందన్నారు. కేబినేట్‌లోనూ 50 శాతం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మంత్రులుగా ఉన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు పెత్తందారులకు పెద్దపీట వేస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను అందలం ఎక్కించారన్నారు. పెత్తందారులు, పేద వర్గాల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, పేదలు గెలిచేలా ప్రతి ఒక్కరూ తీర్పు ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ చిన్న, పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి గడువు పొడిగింపు

- ఏప్రిల్ 5 వరకు అవకాశం

ఎమ్మిగనూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఏప్రిల్ 5 వరకు పొడిగించినట్లు జిల్లా కో–ఆర్డినేటర్, బనవాసి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాస్ గుప్త శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–2025 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి 25.04. 2024న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు htt pr://aprs.apcfss.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల విద్యార్థినీలు దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు. డిగ్రీలో మొదటి సంవత్సరం ప్రవేశానికి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు వచ్చే నెల 5లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25.04.2024 ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంబ్రాయిడరీ(జర్దోసి మగ్గం), ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 30 రోజుల పాటు శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు చదవడం, రాయడం వచ్చిన మహిళలు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం,హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 63044 91236సంప్రదించాలన్నారు.

రూ.5.25 లక్షల అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా ఖనిజ రవాణాకు పాల్పడిన కేసులో వాహనాలకు సంబంధించి రూ.5.25 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోసిగిలో సీజ్ చేసిన హిటాచీ నుంచి రూ.50 వేలు, నూతనపల్లె దగ్గర అక్రమ గ్రావెల్ తరలిస్తుండగా సీజ్ చేసిన మూడు టిప్పర్ల నుంచి రూ.2.5 లక్షలు అపరాధ రుసం వసూలు చేసినట్లు పేర్కొన్నారు. పాణ్యం దగ్గర సీజ్ చేసిన ఐదు గ్రావెల్, మెటల్ టిప్పర్ల నుంచి రూ.1.15 లక్షలు, ఆదోనిలో అనుమతులు లేకుండా గ్రానైట్ స్లాబ్ నిర్వహిస్తున్న నాగరాజు నుంచి రూ.1.10 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు.

న్యాయమూర్తులకు వర్క్‌షాప్





వర్క్‌షాప్ నిర్వహిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, హాజరైన న్యాయమూర్తులు

కర్నూలు (లీగల్): కర్నూలు జిల్లా కోర్టులో న్యాయమూర్తులకు శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి నేతృత్వంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులకు సివిల్ సూట్లపైన రివ్యూ నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ జ్యూడీషియల్ అకాడమి అదనపు డైరెక్టర్ చక్రవర్తి, విశ్రాంతి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివప్రసాద్, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, రివ్యూ సమావేశానికి హాజరైన న్యాయమూర్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎ.శ్రీనివాసకుమార్, ఆదోని రెండవ వాదనపు న్యాయమూర్తి సుధ, నంద్యాల మూడవ అదనపు న్యాయమూర్తి వాసు, కర్నూలు జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి పాండురంగారెడ్డి, జిల్లా 7వ అదనపు న్యాయమూర్తి రాంభూపాల్‌రెడ్డి, ఏసీబీ జడ్జి సునిత, పర్మనెంట్ లోక్ అదాలత్ న్యాయమూర్తి హరినాథ్, జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు హాజరయ్యారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యాన్ని మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.తిమ్మాపురం గ్రామ శివారులో అక్రమంగా కర్ణాటక మద్యం ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన బోయ ఆశన్న, బోయ గుడిసె సూరన్న, శ్రీరాములు, నల్లబోతుల రంగన్నలను అరెస్ట్ చేసి వారి నుంచి 768 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, రాముడు, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్, లక్ష్మన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

- మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- హుసేనాపురం సమీపంలో దుర్ఘటన



ఘటనా స్థలంలో రోదిస్తున్న బాలుడి తండ్రి పరశురాముడు

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడు మృతి చెందగా, మరో ఇద్దరు స్వల్పగాయాలకు గురయ్యారు. ఈ దుర్ఘటన హుసేనాపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కన్నమడకల గ్రామానికి చెందిన వడ్డే పరశురాముడు, శిరీష దంపతులు తమ ఇద్దరి చిన్నారులతో కలిసి నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో బంధువుల పెళ్లి వేడుకకు హాజరై తిరిగి మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. హుసేనాపురం గ్రామ సమీపంలో ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా బైక్ అదుపు తప్పి కిందపడింది.పరశురాముడు, శిరీష దంపతులకు స్వల్పగాయాలు కాగా.. వారి రెండేళ్ల కుమారుడు పవన్ తల పైభాగం చర్మం లేచిపోయి తీవ్ర రక్తస్రావం అయ్యింది. సమీపంలోని ఆసుపత్రి తీసుకెళ్లగా కోలుకోలేక బాలుడు మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

వైభవంగా సుయతీంద్ర తీర్థుల మధ్యారాధన



సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి హారతి ఇస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



భక్తజనం మధ్య బంగారు రథోత్సవం

మంత్రాలయం: మంత్రాలయం క్షేత్ర నవ నిర్మాణ శిల్పి, శ్రీమఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు కనుల పండువగా సాగాయి. శనివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి విశేషంగా పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య మహా పంచామృతాభిషేకం, పుష్పవృష్టి చేసి ప్రత్యేక హారతులు పట్టారు. అనంతరం బంగారు రథంపై సుయతీంద్రుల చిత్రపటాన్ని కొలువుంచి రథయాత్ర చేపట్టారు. మంగళవాయిద్యాలు, హరిదాసుల కీర్తనలు, అశేష భక్తజనం మధ్య రథయాత్ర రమణీయంగా సాగింది. అనంతరం యాగ మంటపంలో సుయతీంద్రతీర్థుల విశిష్టతను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులకు ప్రవచించారు. తమ గురువులు సుయతీంద్రతీర్థుల హయాంలో శ్రీమఠం ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. వేడుకలో భాగంగా రాయచూరు శేషగిరిదాసు దాసవాణి కచేరి భక్తులకు వీనుల విందు చేసింది.

గుర్తింపు కార్డు తప్పనిసరి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల్లో ఉన్న పీఓలు, ఏపీఓలు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం–12, డ్యూటీ ఆర్డర్ కాపీ జిరాక్స్, ఓటర్ల గుర్తింపు కార్డులను ఏప్రిల్ 1వ తేదీన ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో జరిగే శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి పీఓ, ఏపీఓ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని ఆమె కోరారు.

మినీట్రక్కు బోల్తా.. ఒకరు మృతి



బోల్తాపడిన మినీ ట్రక్కు, చిత్రంలో క్షతగాత్రులు



మృతిచెందిన మస్తాన్‌బీ

- 19 మంది కూలీలకు గాయాలు
- వ్యవసాయ పనులకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఆలూరు రూరల్/ఆదోని అర్బన్: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో మినీ ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మస్తానమ్మ (54) అనే వృద్ధురాలు మృతి చెందింది. మరో 18 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆలూరు మండలం చిప్పగిరి రహదారిలోని హత్తిబెళగల్ బస్టాండ్ వద్ద శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. హులేబీడు గ్రామానికి చెందిన 30 మంది కూలీలు చిప్పగిరి మండలం డేగులహాలు గ్రామ మిరప పొలాల్లో పనులకు వెళ్లి బొలెరో మినీ ట్రక్కులో తిరిగి వస్తున్నారు. ఆలూరు మండలంలోని హత్తిబెళగల్ గ్రామ బస్టాండ్ వద్ద మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 19 మందికి గాయాలయ్యాయి. ఇందులో మస్తానమ్మ, శేఖమ్మ, దస్తగిరమ్మ, రమీజా, జైనాబీ, ఖాజాబీ, మహబూబ్‌బీలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో తీవ్రంగా గాయపడి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మస్తానమ్మ కోలుకోలేక మృతిచెందింది.

సకాలంలో స్పందించిన 108 అంబులెన్సులు

రోడ్డు ప్రమాదం విషయం తెలియగానే రెండు 108 అంబులెన్స్‌లు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నాయి. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను ఆదోని ఆస్పత్రికి తరలించాయి. సకాలంలో గాయపడ్డ వారిని ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారని క్షతగాత్రుల బంధువులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలకు తిలోదకాలు..

వాహనం సామర్థ్యం మించి ప్రయాణికులను తరలించరాదనే నిబంధన మండలంలో ఎక్కడా అమలు కావడం లేదు. పోలీసులు,ఆర్టీఓ అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారులు కాసులకు కక్కుర్తిపడి ఇష్టానుసారంగా ప్రయాణికులను తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ట్రక్కుల్లో కూడా వారిని తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓలు పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. గతంలో అనేకసార్లు ఎన్నికల విధుల నిర్వహించామన్న నిర్లక్ష్యపు ధోరణితో కాకుండా పనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. శనివారం ఎంఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో సాధారణ ఎన్నికల–2024 నిర్వహణపై మొదటి దశలో మంత్రాలయం, ఆలూరు, రెండో దశలో ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల పీఓలు, ఏపీఓలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. మే 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఈవీఎంల కనెక్షన్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో వచ్చిన మార్పులను గమనించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి రవాణా, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మే 12వ తేదీన సాయంత్రం వాటిని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఫర్నిచర్‌ను చేర్చుతామన్నారు. ఓటరు ఎపిక్ కార్డు తీసుకురాని పక్షంలో ఎనిమిది ప్రభుత్వ గుర్తింపు కార్డుల ద్వారా కూడా ఓటు హక్కుకల్పించాలన్నారు. గత ఎన్నికల్లో మాక్ పోల్ స్లిప్‌లు డబ్బాల్లో ఉంచేవారని, ఈసారి కొత్తగా బ్లాక్ కవర్ ఇచ్చారని, మాక్ పోల్ స్లిప్‌లను దానిలో ఉంచి లక్కతో సీల్ చేయాలన్నారు. అనంతరం జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఈవీఎం డెమో, పీఓ డైరీపై, కర్నూలు నగర పాలకసంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, పత్తికొండ ఆర్‌డీఓ మాక్‌పోల్, ఈవీఎంల నిర్వహణ, ఎమ్మిగనూరు ఆర్‌ఓ చిరంజీవి, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి డాక్యుమెంటేషన్‌పై శిక్షణ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృత్యువాత

దొర్నిపాడు: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. దొర్నిపాడుకు చెందిన దూదేకుల రాజాహుసేన్(36) బేల్దార్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య కుళాయమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శనివారం ఉదయం స్లాబ్ పనులకు ఉపయోగించే ఇనుప పైపు పక్కకు తీస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగకు తగిలి స్పృహ కోల్పోయాడు. ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.